క్లుప్తంగా

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు



తమ్మడేపల్లిలో కలశాలను తీసుకెళ్తున్న భక్తులు

అమరాపురం: తమ్మడేపల్లిలో వెలసిన మాలల ఆరాధ్య దైవం లక్ష్మీనరసింహస్వామి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం మాలలు కళశాలతో గ్రామపురవీధుల్లో ఊరేగింపుగాగొడన కుంట ఉన్నత పాఠశాల సమీపంలో వున్న స్వామి వారి మూల విరాట్ వద్దకు వెళ్లి అక్కడ ప్రత్యేకంగా పూజలు చేశారు. తర్వాత ఆలయానికి చేరుకుని పూజలు చేపట్టారు.

వివాహిత అదృశ్యం



భవ్యశ్రీ (ఫైల్)

రొళ్ల: హెచ్‌టీహళ్లికి చెందిన లక్ష్మీకాంత్ కుమార్తె కె.భవ్యశ్రీ అదృశ్యమైంది. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కె.భవ్యశ్రీని అమరాపురం మండలం బంగారు పాళ్యం గ్రామానికి చెందిన యంజారప్పకు ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. ఈ నెల 12న పుట్టింటికి వచ్చిన ఆమె ఈనెల 17 నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం బాధితురాలి తల్లి కెంచమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

ముగిసిన టీచ్ టూల్ శిక్షణ



శిక్షకులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో తొమ్మిది రోజుల పాటు కొనసాగిన టీచ్ టూల్ శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్, ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ.. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో, వారికి స్థాయికి తగ్గ రీతిలో బోధించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. శిక్షణ చాలా బాగా ఉపయోగపడిందన్నారు. పాఠశాల స్థాయిలో అమలు పరుస్తామని తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ అబ్రహం, ఏఎంఓ మహేందర్ రెడ్డి, ఎంఈఓ–2 ప్రసన్నలక్ష్మి, ఎంజీఎం సామ్రాజ్యం, ఆర్పీలు ఓబులరాజు, రంగనాథ రాజు, అపర్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గార్మెంట్స్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ యాస్మిన్

పరిగి: మండల కేంద్రంలోని ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్ పరిశ్రమలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ యాస్మిన్ ఆధ్వర్యంలో గుండె, కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతపురం కిమ్స్ సవేరా ఆస్పత్రి వైద్యులు గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించగా...మిడ్ వెల్ ఆస్పత్రి బెంగళూరు వైద్యులచే కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మొత్తం 367 మంది కార్మికులకు వైద్య పరీక్షలను నిర్వహించగా, వారిలో 10 మందికి గుండెకు సంబంధించిన వైద్యానికి కిమ్స్ సవేర ఆస్పత్రికి రెఫర్ చేశామని డాక్టర్ యాస్మిన్ తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం మహేష్, జీఎం సిద్దూ, హెచ్ఆర్ గంగాధర్, రాజు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

లేపాక్షి: స్థానిక గలిబిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



సోమందేపల్లి: మండల కేంద్రంలోని మారుతీనగర్‌లో విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొనింది. శనివారం చౌకధాన్యపు షాపులకు బియ్యం సరఫరా చేయడానికి వచ్చిన లారీని డ్రైవర్ ఇరుకు వీధుల్లో తీసుకు రావడంతో ప్రమాదం జరిగింది. దీంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో అధికారులు అక్కడికి చేరుకొని విద్యుత్ సరఫరా యథావిధిగా పునరుద్ధరించారు.

- బిందు సేద్యం కింద పెరిగిన పంటల సాగు
- నియోజకవర్గంలో 7544.5 హెక్టార్లలో ఉద్యాన పంటలు
- శ్రీసత్యసాయి జిల్లాలో గతంలో 10 వేల హెక్టార్లకు పైగా డ్రిప్ సరఫరా



మడకశిర నియోజకవర్గంలో వాణిజ్య పంటల వివరాలు (హెక్టార్లలో)

మండలం	మామిడి	దానిమ్మ	వక్క	పూలు	కూరగాయలు
మడకశిర	1039	399	85	145	288
రొళ్ల	156	550	380	225	115
గుడిబండ	296	265	260	71	230
అమరాపురం	135	295	950	10	170
అగళి	275	180	385	360	280

రైతుల చూపు.. సూక్ష్మ సేద్యం వైపు

రొళ్ల: మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా రైతులు సూక్ష్మ సేద్యం(బిందు, తుంపర) వైపు మొగ్గు చూపుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే అవకాశం ఉండడంతో రైతులు అటువైపు అడుగులు వేస్తున్నారు. నీటి వసతి కలిగిన రైతులు ప్రధానంగా అరటి, మామిడి, సపోటా, దానిమ్మతో పాటు వక్క, బొప్పాయి, మల్బరీతో పాటు పూలు, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 7544.5 హెక్టార్లకు పైగా వాణిజ్య పంటలు సాగు చేసినట్లు అధికారాల అంచనా. ప్రధానంగా బోరు బావులు ఉన్న రైతులు బిందు సేద్యంపై మొగ్గు చూపుతున్నారు.

బిందు సేద్యంపై ఆసక్తి

నీటి వసతి కలిగిన రైతులు బిందు సేద్యంపై ఆసక్తి చూపుతున్నారు. మామూలుగా ఎకరాకు కట్టే నీళ్ల డ్రిప్పు పద్ధతిలో రెండు నుంచి మూడెకరాల వరకు కట్టుకోవచ్చు. పంటలో కలుపు సమస్య కూడా కొంతవరకూ తగ్గుతుంది. దీంతో కూలీ ఖర్చులు కలిసి వస్తాయి. గతం ప్రభుత్వం ఐదెకరాల లోపు భూములు కలిగిన రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు అందించింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా సబ్సిడీతో బిందు సేద్య పరికరాలను అందించాలని రైతులు కోరుతున్నారు.

వాణిజ్య పంటలతో ఆదాయం



ఏటా వేరుశనగ, వరి, రాగి పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టాలు చవిచూసేవాళ్లం. అయితే పదేళ్లుగా మూడు ఎకరాల్లో వక్క పంటను సాగు చేసి లాభం పొందుతున్నాం. బిందు సేద్యంతో నీళ్లు ఆదా అవుతున్నాయి. ఖర్చులు పోగా ప్రతి పంటకు రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

– నారాయణప్ప, టీడీ పల్లి, రొళ్ల మండలం

బిందు సేద్యంతో నీటి ఆదా



తక్కువ నీటితో బిందు సేద్యం ద్వారా వాణిజ్య పంటలు సాగు చేసి అధిక లాభం పొందొచ్చు. 2.5 ఎకరాల విస్తీర్ణంలో బిందు సేద్యంతో కొత్తగా వక్క తోటను సాగు చేశా. నీటి ఎద్దడి ఉన్నా బిందు సేద్యంతో నీరు ఆదా అయింది. దీనికి తోడు వేరుశనగ, రాగి, వరి వంటి పంటలు సాగు చేస్తున్నాం.

– గంగమ్మ బంద్రేపల్లి, రొళ్ల మండలం

సబ్సిడీతో డ్రిప్ పరికరాలు సరఫరా చేయాలి



అర్హత ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు అందజేయాలి. బోరుబావిలో తక్కువ నీరున్నా బిందు సేద్యం ద్వారా వాణిజ్య పంటలు సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం 1.2 ఎకరాల్లో పత్తి, 5.5 ఎకరాల్లో వక్కపంట సాగు చేశాను. ప్రస్తుతం వక్క పంటకు నీళ్లు ఎక్కువ కట్టాల్సి ఉంది. డ్రిప్పు పరికరాలు అందిస్తే ఉపయోగంగా ఉంటుంది.

– చిత్తయ్య, జీజీ హట్టి గ్రామం, రొళ్ల మండలం

కలలను సాకారం చేసుకోండి



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

పెనుకొండ: విద్యార్థులు కలలు కనండి..ఆ కలలను సాకారం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కళాశాలలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో కలాం చేసిన సేవలను ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. నిత్యం దేశసేవకే జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అబ్దుల్ కలాం అని ప్రిన్సిపాల్ వివరించారు. అధ్యాపకులు మూర్తి, హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ, శివణ్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ పర్యటన

అమరాపురం: వలస గ్రామంలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వలస గేట్ వద్ద హెలీ ప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ వెంకట సుబ్బయ్య, సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ఖైదీలకు సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: జైలులో ఉన్న ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులో ఎంత మంది ఖైదీలు ఉన్నారు? ఏయే నేరాలపై శిక్ష అనుభవిస్తున్నారు? ఎప్పటి నుంచి ఉంటున్నారు తదితర విషయాలను జైలు సూపరెంటెండెంట్ అంజి నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. జైలులో అందుతున్న సౌకర్యాలు, భోజనం నాణ్యత, నీరు తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ.. క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు వస్తే గౌరవ మర్యాదలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత ప్రశాతంగా జీవించాలని సూచించారు. అనంతరం జైలు రికార్డులు పరిశీలించారు. న్యాయమూర్తి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాదులు కళావతి, పార్వతి, నవేరా, నరసింహమూర్తి, వేణుగోపాల్, లోక్ అదాలత్ సిబ్బంది శారద ఉన్నారు.

మాదక ద్రవ్యాల వాడకంతో అనర్థాలు



రోగులకు పండ్లు అందజేస్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ

హిందూపురం అర్బన్: మానసిక రోగుల్లో మార్పు తీసుకొచ్చేలా బాధిత కుటుంబ సభ్యులతో పాటు వైద్యులు ప్రయత్నించాలని స్థానిక అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మానసిక సమస్యలు, రుగ్మతలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. న్యాయమూర్తులు మాట్లాడుతూ.. అనేక మంది మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వాడకంతో అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. శారీరక ఆరోగ్యానికి మందులు వాడితే నయమవుతుందని.. మానసిక రోగానికి మందులు ఉండవన్నారు. అనంతరం మానసిక వ్యాధిగ్రస్తులకు న్యాయమూర్తులు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెంటెండెంట్ డా.రోహిల్‌కుమార్, వైద్యులు రాజగోపాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, సుధాకర్, కళావతి, పార్వతి, నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది శారద పాల్గొన్నారు.

సమాజ సేవకుడికి అరుదైన ప్రశస్తి



మానం శశికిరణ్

పావగడ: స్థానిక సమాజ సేవకుడు, హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్‌కు అరుదైన ప్రశస్తి దక్కింది. హెల్ప్ సొసైటీ సేవలను గుర్తించి కన్నడ అభివృద్ధి ప్రాధికార సంస్థ విధాన సౌధ బెంగుళూరు, కల్ప వృక్ష యువ పట్టణ, గ్రామీణాభివృద్ధి సంస్థ శశికిరణ్‌కు శ్రీ కల్ప వృక్ష ప్రశస్తి అందించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థల నిర్వాహకులు మానం శశికిరణ్ కు ప్రశస్తి అందచేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, మానం వెంకట స్వామి తదితర నాయకులు, స్నేహితులు, హెల్ప్ సొసైటీ సంస్థ పదాధికారులు, సభ్యులు హర్షం ప్రకటించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ





జిల్లెడుగుంట పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం, మొక్క నాటి నీరు పోస్తున్న ఎంఈఓ శ్రీధర్

మడకశిరరూరల్: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని హెచ్‌ఎం భూతన్న పేర్కొన్నారు. జిల్లెడుగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మొక్కల పెంపకం ద్వారా కలిగి లాభాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు కరియన్న, ఇందిరమ్మ, సునీత, లలితమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రొళ్ల: దొమ్మరహట్టి గ్రామ సమీపానున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో ఎంఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా మొక్కలు పెంపకం చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఎకో–క్లబ్‌ను ఏర్పాటు చేసి పాఠశాల ఆవరణలో 700 మొక్కలు నాటించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మైలారప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిడుగల్ దుర్గంలో సినిమా షూటింగ్



పాటను చిత్రీకరిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని చారిత్రాత్మక నిడుగల్ దుర్గం లో 'కరిమణి మాలిక నీనల్ల' (మాంగల్యానికి యజమాని నీవు కాదు) అనే కన్నడ చిత్రం షూటింగ్ జరిగింది. ఈసందర్భంగా పాటను చిత్రీకరించారు. పావగడ తాలూకా లోని కెంచమ్మనహళ్లికి చెందిన నిర్మాత, దర్శకుడు చంద్రు ఓబయ్య దర్శకత్వంలో సినిమా రూపుదిద్దుకుంటోంది. చిత్రం హీరో రవీశ్, హీరోయిన్ రమిక సుతార్, నటీనటులు రేఖాదాస్, మూగు సురేశ్, కాక్రోచ్ సుధీర్, వాల్మీకి సంఘం నాయకులు లోకేశ్ పాళేగార్, ఓంకార నాయక, నిడుగల్ జగదీశ్, భాస్కర నాయక తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటాం

- మాజీ మంత్రి, పెనుకొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ



గాయపడిన హరిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



మల్లికార్జున కాలి గాయాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చిన తర్వాత హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలు, దాడులు పెచ్చుమీరాయని, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై మారణకాండ సరికాదని మాజీ మంత్రి, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ అన్నారు. శనివారం మండలంలోని ఊటుకూరులో ఆమె పర్యటించారు. ఇటీవల గ్రామానికి చెందిన హరిబాబుపై కొందరు టీడీపీ వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో హరిబాబు ఇంటికి వెళ్లి ఆయనతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాడి జరిగిన విషయంపై ఆరా తీశారు. వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం ఇప్పటివరకూ పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేయకపోవడంపై పోలీసులతో మాట్లాడారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న సూర్యనారాయణరెడ్డి, మల్లికార్జున స్వగృహాలకు వెళ్లి వేర్వేరుగా పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీటీసీలు అమరావతి, మారుతీరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం:

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ అండ్ టీం చేస్తున్న అరాచకాల నుంచి నాయకులను, కార్యకర్తలను కాపాడుకుంటామని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో జరిగిన సంఘటనలను ప్రజలంతా గమనిస్తున్నారని, జరిగిన ఘటనలపై పోలీసు ఉన్నతాధికారులను కలిసి సత్వరమే బాధ్యులపై చర్యలకు డిమాండ్ చేస్తామన్నారు. పార్టీ అధికారంలో లేకపోయినా కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని ధైర్యాన్ని నింపారు. అనంతరం ఉషశ్రీ మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని, ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మంచి పాలన అందించాలని హితవుపలికారు. ఇప్పటి వరకూ కనీసం అమ్మ ఒడి పథకానికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ తల్లికి వందనం పథకానికి దిక్కులేదన్నారు. కనీసం రైతులకు సైతం పెట్టుబడి సాయం అందించలేదని ప్రభుత్వాన్ని అన్నారు. ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి, అధికారం రాగానే లేనిపోని సాకులతో కాలయాపనకు తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్

హిందూపురం అర్బన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం పట్టణ సమీపంలోని ఏపీఆర్‌జేసీ కళాశాలలో ర్యాగింగ్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పౌరులకు అందించిన హక్కులు, బాధ్యతలు తెలుసుకుని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కళాశాలల్లో ఎవరైనా తోటి విద్యార్థులతో ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. బాగా చదివి కళాశాలకు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కళావతి, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆరోగ్య మైత్రి కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, పద్మరాజ్ జైన్, శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. బెంగళూరు, తుమకూరు, చిత్రదుర్గం, పావగడతో పాటు హిందూపురం నుంచి నేత్ర వైద్యులు, ఆర్థోపెడిక్, గైనాకాలజిస్టి, ఫిజీషియన్లు, డెర్మాటలజిస్టులు హాజరవుతారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మడకశిర: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈనెల30న కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేడు మడకశిరలో జిల్లా కార్మికుల మహాసభ

మడకశిర: పట్టణంలోని అమరాపురం రోడ్డులో ఉన్న ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కార్మికుల ప్రథమ మహాసభ జరుగుతుందని జిల్లా ఏఐటీయూసీ ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి తెలిపారు. సభలో రాష్ట్ర ఇన్‌చార్జ్ సుధీర్ ప్రసంగిస్తారని తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

విద్యా సామగ్రి అందజేత

పావగడ: బీ హొసహళ్లిలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం రామకృష్ణ సేవాశ్రమాధిపతి జపానంద స్వామిజీ విద్యార్థులకు స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాలు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో రాణించాలని కోరారు. గ్రామానికి చెందిన ప్రజ్వల్‌రెడ్డి ఇటీవల నీట్ పరీక్షల్లో 720 మార్కులకు గాను 710 మార్కులు సాధించి విద్యార్థులందరికి ఆదర్శంగా నిలిచాడన్నారు. మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప మాట్లాడుతూ జపానంద స్వామి విద్య, వైద్య రంగాల్లో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామ ప్రముఖుడు చింతలరెడ్డి పాల్గొన్నారు.

అయోధ్య, కాశీయాత్రకు బస్సు సర్వీసు

హిందూపురం: హిందూపురం నుంచి ప్రతి నెల అయోధ్య, కాశీయాత్రకు సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద జెండా ఊపి బస్సులు ప్రారంభించారు. యాత్ర సర్వీసులో ప్రయాణానికి ఒకరికి రానుపోను చార్జీ రూ. 8,500 ఉంటుందన్నారు. అలాగే ఆగస్టు 9వ తేదీ, 20వ తేదీ అయోధ్య కాశీకి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హిందూపురం డిపో అసిస్టెంట్ మేనేజర్ హంపన్న, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. యాత్ర స్పెషల్ బస్సు సర్వీసు కోసం 9440834715 నంబర్‌కు ఫోన్ చేసి టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు.

కంపచెట్ల తొలగింపు



జేసీబీతో కంపచెట్లను తొలగిస్తున్న నాయకులు

లేపాక్షి: మండలంలోని బింగిపల్లిలో సప్లమ్మ, పోలిమరాజు జాతర సందర్భంగా వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ సొంత నిధులతో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లను జేసీబీతో తొలగించారు. దేవాలయ ఆవరణ, రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బషీర్, నిస్సార్, శ్యాం ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గంగాధరప్ప, నరసప్ప, లక్ష్మీనారాయణ, గంగప్ప, ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీ రాయాపురం సమీపంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగను చూపిస్తున్న రైతు నాగేంద్రప్ప



అయ్యవారిపల్లి వద్ద రామకృష్ణారెడ్డి పొలంలో కిందకు ఉన్న విద్యుత్ తీగలు

పొంచి ఉన్న ముప్పు

మడకశిరరూరల్: బీ రాయాపురం గ్రామ సమీపంలో, అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో ఎల్‌టీ విద్యుత్‌లైన్ ప్రమాదకరంగా మారాయి. బీ రాయాపురం వద్ద రైతు నాగేంద్రప్ప పొలం, అయ్యవారిపల్లి వద్ద రైతు రామకృష్ణారెడ్డి పొలంలో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు ప్రమాదం జరగకముందే విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నారు.